# నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, ఆదివారం 31 మార్చి 2024 MEDAK


# నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

**రామాయంపేటకు రానున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

రామాయంపేట, మార్చి 30: బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాన్ని రామాయంపేటలో ఆదివారం నిర్వహించనున్నట్లు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాగరాజు, పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి తెలిపారు. శనివారం రామాయంపేటలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశానికి పార్టీ నాయకులతో పాటు బీఆర్ఎస్ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు హాజరుకావాలని కోరారు.

# మల్లన్న దర్శనానికి వేళాయే..

- **నేడు మల్లన్న బ్రహ్మోత్సవాల 11వ ఆదివారం**
- **భారీగా తరలిరానున్న భక్తులు**



చేర్యాల, మార్చి 30: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాల 11వ ఆదివారానికి వివిధ జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు. 60వేలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. భక్తులు మల్లన్నను దర్శించుకోవడంతో పాటు పట్నం వేసి బోనం సమర్పించుకోనున్నారు. మహామండపం, గంగరేగు చెట్టు ఆవరణతో పాటు బసచేసిన గదుల వద్ద పట్నాలు వేస్తారు. మల్లన్న గుట్టపైన ఎల్లమ్మకు బోనం చేసి మొక్కులు చెల్లించుకుంటారు. మల్లన్న క్షేత్రంలో మొక్కుల అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తుల కోసం ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఓపికతో ఉంటే భవిష్యత్ మనదే

## బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం తథ్యం

- **గజ్వేల్‌కు రూ.150 కోట్ల నిధులు రద్దు చేసిన కాంగ్రెస్ సర్కారు**
- **ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటాం**
- **బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో గజ్వేల్‌లో 50ఏండ్ల అభివృద్ధి**
- **కేసీఆర్ కృషితోనే గజ్వేల్ రూపురేఖలు మారాయి..**
- **గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని రఘునందన్‌కు ఓట్లేందుకు వేయాలి**
- **గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు**



గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, హాజరైన నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు

గజ్వేల్, మార్చి 30: ప్రతి కార్యకర్త ఓపికతో ఉండాలని, ఆరు నెలల్లో మనకే భవిష్యత్ ఉంటుందని, కష్టకాలంలో పార్టీని వీడిన వాళ్లను కాళ్లు మొక్కినా తిరిగి పార్టీలోకి తీసుకునేది లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. శనివారం గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం శామీర్‌పేటలోని అరణ్య అతిథి గృహంలో జరిగింది. ముఖ్య అతిథిగా హరీశ్‌రావు హాజరై మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. వంద రోజుల్లో ఏ ఒక్క హామీ సరిగ్గా అమలు చేయలేదని, కాంగ్రెస్ సర్కారు తీరుతో ఆర్టీసీ, సివిల్ సప్లై కార్పొరేషన్లు దివాళా తీయడం ఖాయమన్నారు. వంద రోజులు గడిచినా పింఛన్ రూ.4వేలు, రైతు బంధు రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు రాలేదన్నారు. గ్రామాల్లో రైతులు బోర్లు వేసే పరిస్థితి వచ్చిందని, వ్యవసాయ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని తెలిపారు. నాడు తెలంగాణ వస్తదా అని అనుకున్నామా అదే విధంగా మళ్లీ మనం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మనకు నష్టం చేసిన వాళ్లను విడిచిపెట్టేది లేదని, లెక్కలు రాసుకుంటున్నామని, వడ్డీతో సహా తీర్చుకుంటామని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో రూ.150 కోట్ల అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ సర్కారు ప్రజలను ఎలా ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే, వాటిని రద్దు చేసిన కాంగ్రెస్ సర్కారుకు బుద్ధిచెప్పాలన్నారు. తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ పనులు చేసి పెట్టానని, కానీ.. కడుపునిండా మాట్లాడలేక పోయానన్నారు. ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. పదేండ్లలో ఎవరినీ వేధించలేదని, ఎవరికీ అపకారం చేయలేదన్నారు.

**గజ్వేల్ అభివృద్ధి కేసీఆర్ ఘనతే...**

గజ్వేల్‌ను పదేండ్ల కాలంలోనే 50ఏండ్ల అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని హరీశ్‌రావు అన్నారు. పంటలు ఎండిపోతే రాత్రి ఫోన్‌చేస్తే తెల్లారి కాలువ తెంపి కూడవెల్లిలోకి నీళ్లు విడుదల చేసిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తుచేశారు. గజ్వేల్‌కు సాగు, తాగునీళ్లు తెచ్చుకున్నామని, జిల్లా దవాఖాన, మాతాశిశు కేంద్రం నిర్మించుకున్నట్లు తెలిపారు. వెంకట్రామిరెడ్డి మంచివ్యక్తి అని, అందరూ కష్టపడి అతన్ని గెలిపించుకోవాలని క్యాడర్‌కు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తున్నాడని, అది మీ అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కష్టకాలంలో విభేదాలు మరిచి పనిచేయాలన్నారు. గజ్వేల్ అభివృద్ధిని చూసి ఓర్వలేని రఘునందన్‌రావుకు ఎందుకు ఓట్లు వేయాలని, గజ్వేల్ మీద కేసీఆర్‌కు ఉన్న ప్రేమ రఘునందన్‌కు ఉంటుందా అన్నారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురించి గ్రామాల్లో చర్చ పెట్టాలన్నారు. నడిచే ఎద్దు అయితే అక్కడే నడుచు కదా... దుబ్బాకలో మోసం చేస్తే అతన్ని బండ కేసి కొట్టారని హరీశ్‌రావు అన్నారు. సమావేశంలో మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, నాయకులు మాదాసు శ్రీనివాస్, అంజిరెడ్డి, కొట్టాల యాదగిరి, ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, మండలపార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### నాకు అండగా నిలవాలి

**- మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి**



తాను మీలో ఒకడినని, అందరూ తనకు అండగా ఉండాలని, ఈ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా కృషి చేసి మంచి మెజార్టీతో గెలిపించాలని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కోరారు. కేసీఆర్, హరీశ్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తనకు అవకాశం కల్పించారని, తన పనితీరుకు పాస్ మార్కులు వేయడంతో సిద్దిపేట కలెక్టర్‌గా వచ్చానని, కలెక్టర్‌గా పనిచేసి గజ్వేల్ అభివృద్ధిలో భాగస్వామ్యం అయిన విషయాన్ని గుర్తుచేశారు. దేశంలోనే అభివృద్ధిలో టాప్-10లో సిద్దిపేట జిల్లా నిలవడం మనకు గర్వకారణమన్నారు. కేసీఆర్ 'గడా'ను ఏర్పాటు చేసి గజ్వేల్‌ను అభివృద్ధిని 50ఏండ్ల ముందుకు తీసుకెళ్లారన్నారు. మెదక్ సీటు ఇస్తామని కాంగ్రెస్ ఆఫర్ చేసినా తాను తిరస్కరించానన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడున్నర ఏండ్ల పాటు పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. సమర్థుడిగా మాజీ సీఎంలు రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్‌ల వద్ద పనిచేశానన్నారు. సమర్థత ఎక్కడ ఉంటుందో విజయం అక్కడే ఉంటుందన్నారు. రూ.100కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటుచేసి సామాజిక కార్యక్రమాలు చేపడుతానని హామీ ఇచ్చారు. ప్రతి నియోజకవర్గంలో ఫంక్షన్‌హాళ్లు నిర్మించి అందరికీ అందుబాటులోకి తెస్తానని తెలిపారు.

### పార్టీకి కష్టకాలంలో అండగా ఉందాం..

**- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



పదవులు అనుభవించిన వారు పార్టీ మారుతున్నారని, కష్టకాలంలో పార్టీలో ఉండి పనిచేసే వారే గొప్పవారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గ్రూప్‌లు బంద్ చేసి పార్టీని కాపాడుకుందామన్నారు. కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. డిపాజిట్ రాని వ్యక్తి కుట్ర పూరిత రాజకీయాలు చేస్తున్నాడని, గజ్వేల్‌ను కేసీఆర్ రూ.10వేల కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టుతో పాటు గజ్వేల్‌లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నర్సారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వర్గల్‌కు రోడ్డు కూడా వేసుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడునెలలు కాలేదని, పార్టీ కండువా వేసుకుంటేనే దందాలు చేసుకోవాలని ఆయన మాట్లాడుతున్నడన్నారు. నర్సారెడ్డి ప్రజల్లో ఎప్పుడైనా కనిపించిండా, తనపై 60కేసులు పెట్టించడన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా అడ్డుకుంటామన్నారు. ప్రతి కార్యకర్త ధైర్యంతో పనిచేసి ఎన్నికల్లో సత్తాచాటాలన్నారు. కాంగ్రెస్ సర్కారు తీరుతో జిల్లాలోని ప్రాజెక్టుల్లో చుక్కనీళ్లు లేవన్నారు. వచ్చేనెల 2న గజ్వేల్‌లో కార్యకర్తల సమావేశం ఉంటుందన్నారు.

### మెదక్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం: ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

భారీ ఆధిక్యంతో వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయమని, అందుకు ప్రతి ఒక్కరూ మరింతగా కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని, కార్యకర్తలు కష్టపడి విజయానికి కృషి చేయాలన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధితో తప్పకుండా మంచి మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పన్ను వసూళ్లు వేగవంతం

## వందశాతానికి కూతవేటు దూరంలో పంచాయతీలు



రుద్రారం పంచాయతీలో పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది

- **పటాన్‌చెరులో రూ.12.49 కోట్లకు రూ.11.46 కోట్లు వసూలు**
- **6 పంచాయతీల్లో వందశాతం కలెక్షన్**
- **20 శాతం పన్నుల వసూళ్లతో వెనుకబడిన క్యాసారం**
- **మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి**

పటాన్‌చెరు, మార్చి 30: పంచాయతీల్లో పన్నుల వసూళ్ల వేగవంతమయ్యాయి. మార్చి చివరి తేదీలోగా వందశాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో పంచాయతీ సిబ్బంది ముందుకెళ్తున్నారు. పంచాయతీల అభివృద్ధిలో పన్నుల వసూళ్లు కీలకం కావడంతో జిల్లా పంచాయతీ అధికారి వందశాతం పన్నుల వసూళ్లు సాధించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈమేరకు 91.78శాతం పన్నులు వసూలు అయ్యాయి. పటాన్‌చెరు మండలంలో రూ.12 కోట్ల 49 లక్షల 64వేల 644ల డిమాండ్ ఉండగా వాటిలో రూ. 11కోట్ల 46లక్షల 87వేల 676 వసూలు చేశారు. రుద్రారం పంచాయతీలో రూ. 2కోట్ల27లక్షలకు రూ. 2కోట్ల 17లక్షలు, పాశమైలారంలో రూ. 1కోటి 98లక్షలకు రూ. కోటి 93లక్షలు, ఇస్నాపూర్‌లో రూ. 2కోట్ల 10లక్షలకు రూ.కోటి 82లక్షలు, ముత్తంగిలో రూ. 88లక్షల 84వేలకు రూ. 78లక్షల 43వేలు, చిట్కుల్‌లో కోటి 62లక్షలకు రూ. కోటి 53లక్షలు, పాటిలో రూ. 98లక్షల 25వేలకు రూ.87లక్షల 46వేలు, ఇంద్రేశంలో 34లక్షల 55వేలకు రూ. 32లక్షల 89వేలు, భానూర్‌లో రూ. 63లక్షల 68వేలకు 56లక్షల 43వేలు వసూలయ్యాయి. క్యాసారంలో మాత్రం రూ.3లక్షల 64వేలకు రూ.73వేల 180 మాత్రమే వసూలయ్యాయి. కేవలం 20శాతం మాత్రమే క్యాసారంలో పన్నులు వసూలు కావడం విశేషం. వందశాతం పన్ను వసూలు చేసి బచ్చుగూడెం, ఘనపూర్, ఐనోల్, కర్ధనూర్, లక్డారం, పెద్దకంజర్ల అన్ని పంచాయతీలకు ఆదర్శంగా నిలిచాయి.

**మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి**

పటాన్‌చెరు మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో పన్ను వసూళ్లకు ప్రధాన అవరోధంగా మొండి బకాయిలు నిలుస్తున్నాయి. మూత పడిన పరిశ్రమలు, భవనాలు నిర్మించి వదిలిపెట్టిన యాజమాన్యాలు, ఆచూకీ లేని సంస్థల ఆస్తులపై పన్నులు వసూలు చేయడం కష్టతరంగా మారింది. పలు విద్యాసంస్థలు సైతం పన్నులు చెల్లించడంలో నిర్లక్ష్యం చూపుతున్నాయి. పన్ను వసూళ్లు జరిగితేనే మండలం నెంబర్‌వన్‌గా నిలుస్తుంది. సంగారెడ్డి జిల్లాలోనే పటాన్‌చెరు మండలంలోని పంచాయతీల్లోనే అధిక పన్నులు వసూలు అవుతాయి. అయితే కొన్ని పంచాయతీలలో బహుళ అంతస్తుల నిర్మాణం జరగడంతో రికార్డుల్లో లేని అంతస్తులపై పన్నులను చూపడంలో పంచాయతీలు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. అన్ని అంతస్తులకు పన్నులు వేస్తే మరిన్ని కోట్ల రూపాయలు పన్నుల రూపంలో వస్తాయి. పలు పరిశ్రమలు సైతం తమ నిర్మాణాలకు అనుగుణంగా పన్నులను చెల్లించడం లేదు.

### మొండి బకాయిలపై దృష్టి పెట్టాం

వందశాతం ఇంటి పన్నుల వసూళ్లకు దగ్గరయ్యాం. మొండి బకాయిలు ఉన్నాయి. వాటి కోసం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నాం. కొన్ని పంచాయతీలు పన్నుల వసూళ్లలో వెనుకబడ్డాయి. గ్రామ కార్యదర్శులు బాధ్యతగా పనిచేసేలా ఆదేశాలు ఇచ్చాం. పంచాయతీల అభివృద్ధికి పన్నుల వసూళ్లే కీలకం. పన్నుల వసూళ్లలో సమస్యలుంటే తక్షణం పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం.

*- హరిశంకర్ గౌడ్, ఎంపీవో, పటాన్‌చెరు*

# అర్హులకు పోస్టల్ బ్యాలెట్ కల్పించాలి

- **వీసీలో రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**

మెదక్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అర్హులైన ప్రతిఒక్కరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో, తూప్రాన్ ఆర్డీవో, జయచంద్రారెడ్డి, డీఈవో రాధాకృష్ణ, స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద తప్పనిసరిగా ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ముగిసిన వెంటనే ఉద్యోగులందరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం మేర అదనపు ఫారం 12లు సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించే సమయంలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఫారం-12 అందజేసి ఉద్యోగి ఆప్షన్ తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తామని, దీనికి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసిందని తెలిపారు. ఉద్యోగుల నుంచి ఫారం 12 తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదుకు ప్రత్యేక అధికారిని కేటాయించాలని, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఫారం 12 సంబంధిత పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్దకు వెళ్తాయని తెలిపారు. ఏప్రిల్ 29 నాటికి పోటీ చేసే అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు సమర్పించాల్సి ఉంటుందని, ఫారం 7ఏ సీఈవో కార్యాలయం ధ్రువీకరించిన తర్వాత ఏప్రిల్ 30 నుంచి మే 1 వరకు రిటర్న్ అధికారి స్థాయిలో పోస్టల్ బ్యాలెట్లను ప్రింట్ చేయాలని ఆదేశించారు. పార్లమెంట్ నియోజకవర్గం హెడ్ క్వార్టర్‌లో మే 3న, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మే 4 నుంచి మే 8 వరకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు స్వీకరించాలని కోరారు. పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి ఫారం-12 సమర్పించి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది తమ ఓటు హక్కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా పొందవచ్చని సూచించారు. అత్యవసర సేవల్లో పాల్గొనే సిబ్బందికి సైతం ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం సీఈసీ కల్పించిందని వికాస్‌రాజ్ తెలిపారు.

### 85 ఏండ్లు పైబడిన వారికి..

85 ఏండ్లు పైబడి పూర్తిగా నడవలేని సీనియర్ సిటిజన్లకు, నడవలేని దివ్యాంగులకు, కోవిడ్ పేషెంట్లుకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందని, ఇంటివద్ద ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునేవారు ఏప్రిల్ 23లోగా ఫారం-12డీ సమర్పించాలని వికాస్‌రాజ్ సూచించారు. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అర్హులను ఏప్రిల్ 25 నాటికి ఎంపిక చేస్తారని, ఏఆర్‌వోలు షెడ్యూల్ రూపొందించి బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటికి వచ్చి షెడ్యూల్ సమాచారం ఓటర్లకు అందిస్తామని తెలిపారు. మే 3 నుంచి మే 6 వరకు మొదటి దశ, మే 8న రెండో దశ ఇంటి వద్ద పోలింగ్ పూర్తి చేస్తామని వికాస్‌రాజ్ తెలిపారు.

# హరీశ్‌రావుపై ఆరోపణలు నిరాధారం

- **దమ్ముంటే విచారణ చేసుకోవచ్చు**
- **ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకే అసత్య ఆరోపణలు**
- **విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ**



సిద్దిపేటలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, మార్చి 30: బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవరించిన వ్యక్తుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి, అప్రతిష్టపాలు చేసే విధంగా కొన్ని పార్టీలు చూస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ ఆరోపించారు. అందులో భాగంగానే మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై రంగనాయక సాగర్ ప్రాజెక్టు విషయంలో అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. శనివారం సిద్దిపేటలోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలేటి రాధాకృష్ణశర్మ మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసమే అధికార పార్టీ, ఇతర పార్టీ నాయకులు హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని టీవీ ఛానళ్లు, సామాజిక మాధ్యమాల్లో హరీశ్‌రావుపై వచ్చిన కథనాలను ఖండిస్తున్నామన్నారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్ కోసం 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ కోసం సర్వే చేసిందని, 2014లో చంద్లాపూర్‌లో 0.8 టీఎంసీల కోసం అలైన్‌మెంట్ ఫైనల్ అయిందని, అయితే రిజర్వాయర్ సామర్థ్యం పెంచడంతో 2015లో అలైన్‌మెంట్ రాగా.. 2016లో ఫీల్డ్ మార్కింగ్ సర్వే పూర్తయిందన్నారు. 2017 మార్చి 19 నాడు నోటిఫికేషన్ వచ్చి.. 3నెలల్లో భూసేకరణ పూర్తి చేశారన్నారు. 2018 ఆగస్టులో మాజీ మంత్రి హరీశ్‌రావు పట్టాదారుల వద్ద మొదటిసారి భూమి కొనుగోలు చేశారని, అందులో రిజర్వాయర్‌కు సంబంధించిన భూమి కానీ, అసైన్డ్ భూమి కానీ లేదన్నారు. అలైన్‌మెంట్ 2017లో పూర్తయితే, 2018లో భూమి కొనుగోలు చేస్తే అలైన్‌మెంట్ ఎలా మారుస్తారని.. ఇది అవగాహన లేని ఆరోపణలే అని ఆయన తెలిపారు. రిజర్వాయర్‌లో భాగంగా జరిగిన భూసేకరణ 123 జీవో ప్రకారమే చేశారని, బలవంతంగా ఎవరి వద్ద భూమి లాక్కోలేదన్నారు. ఈ రికార్డులన్నీ అధికారుల వద్ద ఉంటాయన్నారు. హరీశ్‌రావు కొనుగోలు చేసిన మొత్తం 13 ఎకరాల 12 గుంటలు భూమి పూర్తిగా పట్టాదారుల నుంచే కొనుగోలు చేశారే తప్ప ఎవరి వద్ద లాక్కోలేదన్నారు. ఈ భూమికి సంబంధించి ఎలాంటి విచారణకైనా సిద్ధమని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంతో భూమి కోల్పోయిన రైతులకు ఎప్పటికీ ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని, వారికి ఏ విధంగా అయినా మాజీ మంత్రి హరీశ్‌రావు తగిన సహాయం చేస్తారన్నారు. ఇప్పటికైనా ఎలాంటి ఆధారాలు లేని ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాముని శ్రీనివాస్, ఆంజనేయులు, ఉమేశ్ పాల్గొన్నారు.

# ఎన్నికలకు మీడియా సహకరించాలి


- **రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలి**
- **మెదక్ పార్లమెంట్ ఎన్నికల అధికారి రాహుల్ రాజ్**
- **మెదక్ కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ మీడియా సెంటర్ ప్రారంభం**




మెదక్ కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 30(నమస్తే తెలంగాణ): ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని అధికారులకు మెదక్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మెదక్ కలెక్టరేట్‌లోని రూం నెం. జి1లో శనివారం జిల్లా అదనపు ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటన ప్రసారం చేయడం సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటన వంటి వాటిని సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ ఛానల్స్‌లో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలని ఆదేశించారు. వార్తా పత్రికలు, ఈ పేపర్లు, టెలివిజన్ ఛానళ్లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, మూవీహౌస్‌లు సంక్షిప్త సందేశాలు ఇతర ఆడియో వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలు ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు మీడియా సహకారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, ప్రకటనలు ప్రసారం చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలు పరిశీలించి పెయిడ్ న్యూస్ పరిశీలనకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, లేదా అభ్యర్థులు చేసే ప్రలోభాలు నగదు, మద్యం, చీరలు, వస్తువుల లాంటి సంబంధించిన ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీకి సమాచారం ఇవ్వాలని, 24గంటలు అందుబాటులో ఉంటుందని, ప్రజలు సంప్రదించాలని సూచించారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని, సులభంగా అనుమతి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ హర్దీప్ సింగ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, నోడల్ అధికారులు, ఎలక్షన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎండిన పొలాన్ని పరిశీలించిన అధికారులు



పెద్దచింతకుంటలో ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నర్సాపూర్, మార్చి 30: 'నమస్తే తెలంగాణ'లో ఈనెల 29న ప్రచురితమైన 'నీరులేక ఆరెకరాల్లో... నిలువునా ఎండిన పంట' అనే కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. శుక్రవారం మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ పెద్దచింతకుంట గ్రామాన్ని సందర్శించి నీటి వసతి లేక ఎండిపోయిన రైతు అయ్యవారి ధనుంజయ్ ఆరెకరాల వరి పొలాన్ని పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ మాట్లాడుతూ.. రైతు ధనుంజయ్ పంట నష్టం వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి బి.అనిల్‌కుమార్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ లావణ్య, ఏఈవో శిరీష, మాజీ సర్పంచ్ శివకుమార్ తదితరులు ఉన్నారు.